



# మీ అభిప్రాయం మేరకే..

## రైతు భరోసా అమలు

- గత ప్రభుత్వంలో అనర్హులకు పెట్టుబడి సాయం అందించారు
- ప్రభుత్వ డబ్బు అంటే ప్రజలు పన్నుల రూపంలో చెల్లించేదే..
- మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- రైతు భరోసా అమలుపై వనపర్తి కలెక్టరేట్‌లో కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయ సేకరణ
- పదెకరాల పరిమితి.. సాగు చేస్తేనే డబ్బులు ఇవ్వాలి
- కుటుంబం యూనిట్‌గా అందజేయాలి
- అభిప్రాయం వ్యక్తం చేసిన రైతులు



వనపర్తి కలెక్టరేట్‌లో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ చేస్తున్న కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ మల్లురవి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి; పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

వనపర్తి అర్బన్, జూలై 12: ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, పంట సహాయం ఏ విధంగా చేస్తే బాగుంటుందనే అభిప్రాయం రైతుల నుంచి తీసుకోడానికి కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు ముందుకు వచ్చారని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. రైతు భరోసా అభిప్రాయ సేకరణలో భాగంగా శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులతో వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కేబినెట్ సబ్ కమిటీతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కమిటీ సభ్యులైన తుమ్మల నాగేశ్వరరావుతో పాటు రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లురవి, ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వ్యవసాయ రంగాన్ని, చిన్న, సన్నకారు రైతులను కాపాడుకునేందుకు, వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి కృషి చేస్తుందన్నారు. ఇది రైతు ప్రభుత్వం కాబట్టి రైతు భరోసా కార్యక్రమాన్ని ఏ విధంగా అమలు చేయాలి?, ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి?, కౌలు రైతులకు ఏ విధంగా న్యాయం చేయాలి? అనే విషయాలను రైతుల ద్వారా అభిప్రాయం సేకరిస్తున్నామని చెప్పారు. అనంతరం శాసన సభలో పెట్టి, అందరి ఆమోదంతో విధివిధానాలు ఖరారు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వనరులు, సంపదను ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. ప్రజలు, రైతులు ప్రత్యక్షంగా పరోక్షంగా తమ కష్టార్జితం నుంచి చెల్లించిన పన్ను, వివిధ రంగాల ద్వారా ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం ద్వారా ప్రజల కష్టానికి న్యాయం చేస్తామని అన్నారు. రైతు భరోసా పథకంపై రైతులు, శాస్త్రవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, వివిధ వర్గాల వారి అభిప్రాయాలు, సూచనలు తీసుకుని రైతు సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. ప్రజల ఆలోచనను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రజా రంజకంగా పాలన సాగిస్తామన్నారు.

### కుటుంబం యూనిట్‌గా..

సమావేశంలో అత్యధిక మంది రైతులు ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. రైతుల అభిప్రాయాలను మండలాల వారీగా, జిల్లాల వారీగా తెలుసుకున్నారు. కష్టపడి పంట పండించే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి తప్ప.. వందల ఎకరాలు ఉన్న వారికి, ఇప్పటికే వెంచర్లు అయిన వాటికి, కొండలు, గుట్టలకు, ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలో ఉన్న వారికి రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కమిటీలో రైతులు ఇచ్చిన సలహాలు, సూచనలు శాసన సభలో చర్చించి, చట్ట సభ ద్వారా తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని కమిటీ సభ్యులు అన్నారు.

### రైతును రాజు చేయాలని..

కమిటీ మరో సభ్యుడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులను రాజు చేయాలనే చిత్తశుద్ధితో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం కార్యాచరణ చేపడుతుందన్నారు. రైతు భరోసాను ఏ విధంగా అమలు చేస్తే బాగుంటుందో రైతులనే అడిగి తెలుసుకుంటున్నామన్నారు. వంద ఎకరాల భూస్వాములకు, పోరంబోకు, కొండలు, గుట్టలు, లే అవుట్లు అయిన వాటికి సైతం రైతు భరోసా ఇవ్వాలా? వద్దా? అని మీ అభిప్రాయం చెప్పాల్సిందిగా రైతులను అడిగారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. రైతులకు న్యాయం చేసేందుకు రైతు భరోసా అభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 10 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులు 90 శాతానికి పైగా ఉన్నారని, వారందరికీ రైతు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైతే ఆర్థికంగా బాగున్నారో అలాంటి రైతులు స్వచ్ఛందంగా రైతు భరోసా వదులుకోవాలని సూచించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ఒక కుటుంబంలో 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలన్న మెజారిటీ రైతుల అభిప్రాయాన్ని గౌరవిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, రాజేష్ రెడ్డి, వంశీకృష్ణ, వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, పర్ణిక రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, కలెక్టర్లు విజయేందిర బోయి(మహబూబ్‌నగర్), బాదావత్ సంతోష్(నాగర్‌కర్నూల్), సిక్త పట్నాయక్ (నారాయణ పేట), వనపర్తి ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్లు, రైతులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### ఎంత సాగు చేస్తే అంతే భరోసా ఇవ్వాలి



రైతు ఎంత భూమి సాగు చేస్తే అన్ని ఎకరాలకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి. స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు ప్రభుత్వం వ్యవసాయ పరికరాలు అన్నిటిపైనా సబ్సిడీ ఇస్తే రైతులకు రైతు భరోసా కూడా అవసరం లేదు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూములను రీ సర్వే చేస్తే గెట్టు పంచాయతీలు లేకుండా ఉంటాయి.

\- రాఘవేందర్ రెడ్డి, రైతు, కౌకుంట్ల

### సాగు చేసే వారికే ఇవ్వాలి



పొలాలను సాగు చేసి, పంటలు పండించే రైతులకే రైతు భరోసా ఇవ్వాలి. పొలాలను బీడు పెట్టి, కౌలు రైతులకు సాగుకు కూడా ఇవ్వని వారికి రైతు భరోసా ఇవ్వొద్దు. రైతు భరోసా కౌలు రైతులకు 50 శాతం, యజమానికి 50 శాతం ఇస్తే బాగుంటుంది. దీని మీద ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి.

\- రవి నాయక్, రైతు, ఘణపూర్

# వాపస్ రాని ధరణి సొమ్ము

- స్లాట్ బుక్ చేసుకున్నాక ఆగిన 1,836 భూ రిజిస్ట్రేషన్లు
- బాధితులకు వెనక్కి ఇవ్వని ఫీజు డబ్బులు
- రూ.3,62,15,100 కోసం మూడున్నరేళ్లుగా ఎదురు చూపులు



అయిజ తహసీల్దార్ కార్యాలయం

అయిజ, జూలై 12: ధరణిలో భూ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నాక రద్దయితే.. ఫీజు తిరిగి చెల్లిస్తామన్న ప్రభుత్వం మూడున్నరేళ్లుగా వారి ఖాతాకు జమ చేయడం లేదు. అందుకు సంబంధించి జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,836 మందికి రూ.3,62,15,100 చెల్లించాల్సి ఉందని సమాచారం. ఈ విషయమై గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దాంతో బాధితులు డబ్బుల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. భూ రికార్డుల సంస్కరణల్లో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తెచ్చింది. దీని వల్ల సమస్యలు వస్తున్నాయని రైతుల ఫిర్యాదు మేరకు దాని స్థానంలో కొత్త పోర్టల్ తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది.

### రిజిస్ట్రేషన్ రుసుము ఇలా..

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం మీ సేవ కేంద్రంలో ఆయా ప్రాంతాల భూమి మార్కెట్ విలువలో 7.5 శాతం సొమ్మును ఫీజుగా చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత మార్కెట్ విలువ ఎకరం భూమికి రూ.2,25,000గా నిర్ణయించారు. అందులో 7.5 శాతం అనగా రూ.19,725 ఫీజు కింద చెల్లించాల్సి ఉంది. రూ.19,725లో రూ.16,875 రిజిస్ట్రేషన్ కాగా... రూ.2,500 మ్యుటేషన్, రూ.300 కొత్త పాసు పుస్తకం కోసం, రూ.50 హరితహారం కోసం చెల్లించాల్సి ఉంది. భూమి రిజిస్ట్రేషన్ కోసం ఫీజు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకున్నాక.. కేటాయించిన రోజున తహసీల్దార్ కార్యాలయంలో క్రయ, విక్రయదారులు హాజరుకావాల్సి ఉంది. ఇరువర్గాల సమక్షంలో అధికారులు రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారు. అధికారులు అందుబాటులో లేకపోవడం, సాంకేతిక సమస్యలు, వారసత్వ భూముల విషయంలో ఇబ్బందులు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు కనిపించకపోవటం, అభ్యంతరాలు రావడం, వ్యక్తిగత కారణాల వల్ల చివరి క్షణంలో కొన్ని రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. అలా ఆగిపోయిన రిజిస్ట్రేషన్ల సొమ్మును తిరిగి ఆ వ్యక్తి ఖాతాలో జమచేయాల్సి ఉంది. కానీ జమకాకపోవడంతో సంబంధిత వ్యక్తులు మీ సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

### పోర్టల్ ప్రారంభం నుంచి..

రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నవంబరు 25 నుంచి ధరణి పోర్టల్‌ను ప్రవేశ పెట్టింది. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్ కోసం ఫీజు చెల్లించి, అనివార్య కారణాల రీత్యా రద్దయిన వ్యక్తులు జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,836 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ఫీజుల విలువ దాదాపుగా రూ.3,62,15,100గా సమాచారం.

### కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా

భూమి రిజిస్ట్రేషన్ రద్దు కారణంగా నాకు దాదాపుగా రూ.80,000 వరకు రావాల్సి ఉంది. మూడేళ్లుగా డబ్బు కోసం ఎదురు చూస్తున్నాం. తహసీల్దార్, మీ సేవా కేంద్రాలకు వెళ్లి అడిగితే మాకు సంబంధం లేదంటున్నారు.

\- రామదాసు, అయిజ

### ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

రిజిస్ట్రేషన్ రద్దు అయితే ఫీజు డబ్బులు సంబంధిత వ్యక్తుల ఖాతాలో తిరిగి జమ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. రిజిస్ట్రేషన్ స్లాట్ కోసం బుక్ చేసుకున్న మొత్తం నేరుగా ప్రభుత్వ ఖజానాలో జమ అవుతాయి. రద్దు కారణంగా రావాల్సిన సొమ్ము సైతం అక్కడ నుంచే రావాల్సి ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

\- జ్యోతి, తహసీల్దార్, అయిజ

# రైట్.. రైట్..

- ఆర్టీసీ బస్సు నడిపిన ఎమ్మెల్యే కశిరెడ్డి
- ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని వెల్లడి



ఆర్టీసీ బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూలై 12: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కాసేపు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా మారారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త బస్సులను కల్వకుర్తి బస్టాండ్‌లో శుక్రవారం ఆయన ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నుంచి మద్దిమడుగుకు వయా కొండారెడ్డిపల్లి మీదుగా ఏర్పాటు చేసిన బస్సును కొద్దిసేపు నడిపారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రయాణికులకు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ఆర్టీసీలో కొత్త బస్సులను కొనుగోలు చేయడంతోపాటు సంస్థను సైతం బలోపేతం చేస్తామన్నారు. ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం లక్ష్మీధర్మా, ఇన్‌చార్జి డీఎం సుజాత, అసిస్టెంట్ మేనేజర్ శ్వేత, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, ఎజాస్, రవి, నాయకులు జిల్లెల రాములు, షానవాజ్ ఖాన్, సంజీవ్‌కుమార్ యాదవ్, రాంరెడ్డి, దామోదర్ గౌడ్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్, చంద్రకాంత్‌రెడ్డి ఉన్నారు.

### ఇందిరానగర్ కాలనీలో..

కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించారు. కాలనీ వాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు చెప్పారు. 40 ఏళ్లుగా ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను తొలగిస్తున్నందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న మునిసిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకులు వల్లే ఇందిరానగర్‌కాలనీలో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

# 188 పాఠశాలలు మూత

- విద్యాహక్కు చట్టానికి అధికారుల తూట్లు
- జీరో అడ్మిషన్స్ పేరుతో అక్కడి టీచర్లు బదిలీ
- మరికొన్నింటిలో అడ్మిషన్లు లేవని టీచర్ల కుదింపు
- స్కూల్స్ లేని గ్రామం ఉండకూడదన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు బేఖాతరు
- బడులు మూతపడినా నోరు మెదపని ప్రజా ప్రతినిధులు



గద్వాల మండలంలోని పుటాన్‌పల్లిలో మూతపడిన పాఠశాల

గద్వాల, జూలై 12: ఉమ్మడి జిల్లాలో 188 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. అందులో జోగుళాంబ గద్వాల జిల్లాలో తొమ్మిది ఉన్నాయి. దాంతో ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని రాజ్యాంగం కల్పించింది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రతీ గ్రామంలో పాఠశాల ఉండాల్సిందేనని నొక్కి చెప్పారు. కానీ అందుకు విరుద్ధంగా పాఠశాల విద్యాబోర్డు నిర్ణయంతో స్కూల్‌ను బంద్ చేశారు. ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న ఐదారుగురు విద్యార్థులను కూడా అక్కడి నుంచి పంపించి అడ్మిషన్లు లేవని పేర్కొన్నారు.

### పోస్టులను బ్లాక్ చేసి బదిలీలు

ఉపాధ్యాయుల బదిలీల్లో గద్వాల జిల్లాలో 543 మంది ఎస్‌జీటీ, 346 మంది స్కూల్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. దాంతో పాటు 270 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, 27 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా ప్రమోషన్లు కల్పించారు. వీటి బదిలీ సందర్భంగా.. జీరో అడ్మిషన్లు చేసిన తొమ్మిది పాఠశాలల పోస్టులకు బ్లాక్ చేశారు. అంటే ఈ పాఠశాలల్లో ఉన్న టీచర్లను బదిలీ చేసి, మరెవరు ఈ పాఠశాలను ఎంపిక చేసుకోకుండా బ్లాక్‌లో పెట్టారు. బదిలీలు పూర్తయినందున ఇప్పుడు ఈ పాఠశాలల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చూపుతున్నారు. ఇవే కాకుండా మరో 50 పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించారు. ఒకటి నుంచి 19 మంది వరకు విద్యార్థులకు ఒకరు చొప్పున ఉపాధ్యాయులను చూపి, ఎక్కువ మంది ఉన్న చోట బదిలీ చేశారు. బదిలీ పోస్టును బ్లాక్ చేసి, మరొకరికి అవకాశం కల్పించలేదు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట మాత్రం ఉపాధ్యాయుల సంఖ్యను పెంచకపోవడం విడ్డూరంగా ఉంది. అక్కడికి డిప్యుటేషన్లు తప్ప మరో మార్గం కనిపించడం లేదు.

### ఈ ఏడాది ఆరు..

జిల్లాలో గత ఏడాది వరకు మూడు పాఠశాలలు మూత పడగా, ఈ ఏడాది మరో ఆరు పాఠశాలలు మూతపడ్డాయి. రేషనలైజేషన్ ప్రకారం ఒకటి నుంచి 19 మంది విద్యార్థులు ఉన్నచోట ఏకోపాధ్యాయ పాఠశాల నిర్వహించాలి. కానీ జీరో అడ్మిషన్ల పేరుతో వీటిని మూసి వేశారు. అందులో గద్వాల మండలం పుటాన్‌పల్లి, బస్వాపురం, ధరూర్ మండలంలో మీర్జాపురం, పెద్దచింతరేవుల, గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి, మాచర్ల(ఉర్దూ మీడియం), ఇటిక్యాల మండలం నక్కలపల్లి, మల్దకల్ మండలం ఎద్దుల గూడెం, వడ్డేపల్లి మండలం గాంధీనగర్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలన్నీ పట్టణాలకు దూరంగా ఉన్నాయి. అందులో ఎక్కువగా నిరుపేద విద్యార్థులే చదువుకుంటున్నారు. గత ఏడాది వరకు నిర్వహించిన ఈ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు టీసీలు ఇచ్చి, జీరో అడ్మిషన్లు చేసి మూసేశారు. ఆ పాఠశాలలు మూత పడటంతో అక్కడున్న విద్యార్థులు పక్క ఊరికి వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూత పడిన ప్రాథమిక పాఠశాలల వివరాలు**

| జిల్లా | సంఖ్య |
|---|---|
| నాగర్‌కర్నూల్ | 61 |
| నారాయణపేట | 42 |
| గద్వాల | 9 |
| మహబూబ్‌నగర్ | 48 |
| వనపర్తి | 28 |

### విద్యార్థులు లేనందుకే పోస్టులు బ్లాక్

గద్వాల జిల్లాలోని మూత పడిన తొమ్మిది పాఠశాలల్లో విద్యార్థులు లేరు. తల్లిదండ్రులను పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరాం. అయినప్పటికీ విద్యార్థులు రాకపోవడంతో స్టేట్ నుంచే ఆ పాఠశాలల పోస్టులను బ్లాక్ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేశారు. పది మంది విద్యార్థులు ఉన్నారని తల్లిదండ్రులు వస్తే టీచర్‌ను ఏర్పాటు చేస్తాం.

\- సురేశ్, గద్వాల, ధరూర్, కేటీదొడ్డి, మల్దకల్ మండలాల విద్యాధికారి

### పట్టించుకోని పాలకులు

జిల్లాలో తొమ్మిది పాఠశాలలు మూత పడగా ఒక్క ప్రజా ప్రతినిధి కూడా నోరు మెదపక పోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమావేశాలలో విద్యాభివృద్ధి గురించి మాట్లాడే నాయకులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నిస్తున్నారు. మూతపడిన పాఠశాల గ్రామాలు కూడా రాజకీయాలను ప్రభావితం చేసే నాయకులవే కావడం గమనార్హం.

# కోల్డ్ స్టోరేజీలో అమ్మోనియం లీకేజీ

- అలంపూర్ చౌరస్తాలో భయాందోళనలకు గురైన స్థానికులు, ప్రయాణికులు
- కళ్లలో మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు
- సమయానికి అందుబాటులో లేని సిబ్బంది



పైపు లీకేజీని నియంత్రించే ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అలంపూర్ చౌరస్తా, జూలై 12 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తా సమీపంలోని ఆర్ఆర్ కోల్డ్ స్టోరేజీలో గ్యాస్ పైపులు లీక్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటు అంతర్ రాష్ట్ర, అటు జాతీయ రహదారికి సమీపంలో స్థానిక గృహాలకు అతి సమీపంలో ఆర్ఆర్ కోల్డ్ స్టోరేజీ ఉంది. ఇందులో వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిలువ ఉంటుంది. ధాన్యం నిలువలు చెడిపోకుండా ఉండేందుకు నిత్యం ఏసీని విడుదల చేస్తుంటారు. అయితే శుక్రవారం సాయంత్రం ఆరున్నర గంటల నుంచి గోదాంకు వెనక భాగంలో అమర్చిన గ్యాస్‌పైపుల ద్వారా అమ్మోనియం లీక్ అయ్యింది. లీకైన గ్యాస్‌పైపు నుంచి విపరీతమైన దుర్వాసన రావడంతో కళ్లు మంటలు, శ్వాస సంబంధమైన ఇబ్బందులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు ఇళ్లలోకి వెళ్లి కిటికీలు, తలుపులు మూసుకున్నారు. సుమారు రెండు గంటల పాటు స్థానిక ప్రజలతో పాటు, ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడ్డారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి గ్యాస్ లీకేజీని ఆపే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత తాపీగా అక్కడకు చేరుకున్న గోదాం సిబ్బంది గ్యాస్ సరఫరాను నిలిపివేశారు. చాలాసేపటి తర్వాత వాయు కాలుష్యం తగ్గిందని స్థానికులు తెలిపారు. సకాలంలో గోదాం సిబ్బంది అక్కడ ఉండి అవసరమైన చర్యలు తీసుకుని ఉంటే ఇంత ఇబ్బంది పడేవాళ్లం కాదని అక్కడున్న వారు తెలిపారు.



లీకవుతున్న అమ్మోనియం

### మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించాలి

**\- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్**

నారాయణపేట టౌన్, జూలై 12: జిల్లాలో మహిళా శక్తి కార్యక్రమాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి పట్టణ కేంద్రాలలోని ప్రభుత్వ సామాజిక భవనాలను గుర్తించి వాటిలో వీలైనంత త్వరగా మహిళా శక్తి క్యాంటీలను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళిక బద్ధంగా చేపట్టి రాష్ట్రంలోనే నారాయణపేటను నెంబర్‌వన్‌గా నిలపాలన్నారు. పీఎంఎఫ్ఎంఈ యూనిట్లను రెండు రోజుల్లో ప్రారంభించాలన్నారు. డెయిరీ ఎనిమల్స్ 35 యూనిట్లను కూడా రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ధన్వాడ మండలం కోయిల్‌సాగర్, కృష్ణ, గుడెబల్లూరులో గుర్తించిన ఫిష్ మొబైల్ వెహికల్ యూనిట్లతో పాటు మహిళా శక్తి యూనిట్లను పూర్తిచేసేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. మరికల్ మండలంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను గుర్తించాలన్నారు. జిల్లాకు మంజూరైన పది మీసేవ కేంద్రాలను ఉన్నత విద్యార్హత కలిగిన నిరుద్యోగులకు నిర్వహణ బాధ్యత అప్పగించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్, డీఆర్‌డీవో రాజేశ్వరి, ఆయా మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## జూరాల ఎడమ కాలువ ద్వారా
# సాగునీరు విడుదల



ఎడమ కాలువ ద్వారా విడుదలవుతున్న సాగునీరు

ఆత్మకూరు, జూలై 12: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా సాగు నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు డీఈ నారాయణ తెలిపారు. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి స్వల్పంగా వరద రావడంతో ఎడమ కాలువ ద్వారా ఖరీఫ్ సీజన్‌కు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో ఉన్న 83వేల ఎకరాలు సాగులోకి రానుందని తెలిపారు. రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## బాల కార్మికులకు
# వెట్టిచాకిరీ నుంచి విముక్తి

**- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కోర్టుకు తరలింపు**

మన్ననూర్, జూలై 12: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలో బాల కార్మికులుగా మేకలు కాస్తున్న ముగ్గురు ఆదివాసీ చెంచు బాలురకి వెట్టిచాకిరీ నుంచి విముక్తి లభించింది. వివరాల్లోకి వెళితే... మండలానికి చెందిన రాక్రూ, కొర్ర సేవ్య అనే మేకల యజమానుల వద్ద జీతానికి కుదిరారు. కొన్ని నెలలుగా బాలురు మేకలను కాస్తున్నారు. రెండు రోజుల క్రితం మూడు మేకలు మందలో నుంచి తప్పిపోవడంతో రాక్రూ అనే మేకల యజమాని ఓ బాలుడికి చితక బాదినట్లు వారి తల్లిదండ్రులు మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఐటీడీఏ అధికారులు, చైల్డ్ హెల్ప్‌లైన్ వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చెంచు బాలుడికి పనిలో పెట్టుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేయాలని దరఖాస్తు ఇచ్చారు. ఈ మేరకు విచారణ నిమిత్తం ఆపరేషన్ ముస్కాన్ టీం అక్కడికి వెళ్లి పరిశీలించి విచారణ చేశారు. ముగ్గురు పిల్లలు బాలకార్మికులుగా చేరి మేకలు కాస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు చెంచు బాలురను రాక్రు, సేవ్యల నుంచి విడిపించుకొని నాగర్‌కర్నూలు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కోర్టుకు తీసుకెళ్లారు. అక్కడే బాలరకు కౌన్సెలింగ్ ఇచ్చి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేర్పిం చేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. అచ్చంపేట సబ్ డివిజన్ ఎస్ఐ వెంకటరెడ్డి, కానిస్టేబుళ్లు రాజా, తిరుపతి, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు సృజన, మౌనిక పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అవకతవకలు

**- 150 మందికి అందని డబ్బు**

**- నిధులు కాజేశారని ఆరోపణ**

**- ఎంపీడీవో ఆఫీస్ ముందు కూలీల ఆందోళన**

కల్వకుర్తిటౌన్, జూలై 12 : కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు శుక్రవారం ఎంపీడీవో ఆఫీస్ ముందు ఆందోళనకు దిగారు. గ్రామంలో 250మంది ఉపాధిహామీ కూలీలు ఉంటారని అందులో 150మందికి గత 2018 సంవత్సరం నుంచి డబ్బులు అందలేదని, అకౌంట్‌లో డబ్బులు పడినట్లు చూపిస్తుందని కానీ ఒక్క రూపాయి కూడా అందలేదనివారు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల డబ్బులు కాజేసిన అధికారులను, అందుకు సహకరించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఫిర్యాదులు చేసిన పైస్థాయి అధికారులు ఎవరూ పట్టించుకోలేదని, ఈ విషయంపై కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు ఎంపీడీవో ఆఫీస్ ముందు నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీవో వెంకట్రాములుకు వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ కూలీల డబ్బులు వారికి అందేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కూలీలు అనసూయ, అలివేలు, సుభద్ర, లక్ష్మమ్మ, రాములమ్మ, ఊర్మిళ, ధనమ్మ, గ్రామస్థులు తాళ్ల సురేష్, శ్రీశైలం, శ్యామ్‌సుందర్, వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

## బురెడ్డిపల్లి టీ జంక్షన్‌ను పరిశీలించిన డీఎస్పీ



జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి టి జంక్షన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

జడ్చర్ల, జూలై 12 : జాతీయ రహదారి జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి స్టేజీ సమీపంలో ఉన్న టి జంక్షన్‌ను శుక్రవారం రోడ్డు భద్రతశాఖ డీఎస్పీ సుదర్శన్, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌లు పరిశీలించారు. జిల్లా ఎస్పీ జానకి ధారావత్ ఆదేశాల మేరకు బురెడ్డిపల్లి టి జంక్షన్‌ను పరిశీలించినట్లు వారు పేర్కొన్నారు. జాతీయ రహదారి నుంచి బురెడ్డిపల్లికి వెళ్లే టి జంక్షన్‌లో ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగి, ఎందరో మృత్యువాత పడ్డ సంఘటనల దృష్ట్యా, ప్రమాదాలు నివారించడానికి చేపట్టాల్సిన చర్యలపై పరిశీలించారు. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్న బురెడ్డిపల్లి టి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ డీఎస్పీ దృష్టికి బురెడ్డిపల్లి వాసులు తీసుకువచ్చారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐలు తెలిపారు.

## గోరింట పూసింది

**- ఎర్రగా పండిందని సంతోషం వ్యక్తం చేసిన మహిళలు**



గోరింటాకు చూపిస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 12 : అధిక శాతం మహిళలు ఆషాఢ మాసం కోసం ఎదురు చూస్తుంటారు. ఆషాఢ మాసం వచ్చిందంటే మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకొని సంతోషం వ్యక్తం చేస్తుంటారు. మహిళలు కాలనీలో ఒక దగ్గర సమావేశమై తమ యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఒకరికొకరు చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. చేతులకు ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకుంటే శరీరంలో ఉండే వేడి తగ్గుతుందని పలువురు నమ్ముతారు. స్థానిక డ్రగిస్ట్ భవన్‌లో శుక్రవారం గిరిజా మాత మెడికల్ ఉమెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఒకరికొకరు గోరింటాకు పెట్టుకొని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఛైర్మన్ సుప్రియ, ప్రెసిడెంట్ చంద్రప్రభ, కార్యదర్శి లిఖిత, కోశాధికారి ఉదయచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

**- ట్రాక్టర్ ఓనర్‌కు రూ.1500 జరిమానా - వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ**

గద్వాల క్రైం, జూలై 12 : అతివేగంగా, అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపుతూ ముందు వెళ్లే బైక్‌ను ఢీకొట్టి వ్యక్తి మరణానికి కారణమైన కేసులో ట్రాక్టర్ డ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్ష, ట్రాక్టర్ ఓనర్‌కు రూ.1500 జరిమానా విధిస్తూ శుక్రవారం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటహైమ పూజిత తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి చెందిన పుట్ట స్వామిదాస్ చిన్న కుమారుడైన పుట్ట ఉదయ్‌కుమార్(16), అతని మిత్రులు కాశపోగు ఇజ్రాయిల్, చిన్న ఇజ్రాయిల్‌తో కలిసి 2019, మే 10వ తేదీన కలంగిరి పండ్లు తీసుకొచ్చేందుకు తాటికుంట స్టేజీకి గ్రామానికి చెందిన దేవదాసు బైక్‌పై బయలుదేరారు. ముందు వెళ్తున్న వీరి బైక్‌ను వెనుక నుంచి అతివేగం, అజాగ్రత్తగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనగా పుట్ట ఉదయ్‌కుమార్‌కు బలమైన రక్త గాయమై చనిపోవడంతో పాటు, మిగతా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయంపై ఆదేరోజు తన కుమారుడు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి పుట్ట స్వామిదాస్ ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు విచారించి ట్రాక్టర్ వివరాలను తెలుసుకోగా మాన్‌దొడ్డి గ్రామానికి చెందినదిగా గుర్తించారు. తర్వాత జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారించి అతివేగం, అజాగ్రత్తగా ట్రాక్టర్‌తో ఢీకొనడం వల్లే మరణించాడని పోలీసులు నిర్ధారించుకొని వాహన డ్రైవర్, ఓనర్‌ను రిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీ ఆదేశాల మేరకు కోర్టులో సాక్షులను మోటివేట్ చేశారు. శుక్రవారం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటహైమ పూజిత కేసులో నిందితులు రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఏ1 బోయ వెంకటేష్ అనే డ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్ష, అలాగే కర్నూల్ జిల్లా గూడూరు మండలం మునగాల గ్రామానికి చెందిన ఓనర్ ఏ2 రంగారెడ్డికి రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నేరస్తులకు జైలుశిక్ష పడటానికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భవాని, కోర్టు కానిస్టేబుల్ రాందాస్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆలయాలలో వరుస చోరీలు

**- నిన్న తాయమ్మ గుడిలో, నేడు వీరభద్రస్వామి ఆలయంలో దొంగతనం**

**- పోలీసుల అదుపులో నిందితుడు ?**



వివరాలను సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

గద్వాల క్రైం, జూలై 12 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో దొంగలు దేవాలయాలను టార్గెట్ చేస్తున్నారు. బుధవారం రాత్రి గద్వాల పట్టణంలోని బీరెల్లి రోడ్‌లో ఉన్న తాయమ్మ గుడిలో హుండీ ఎత్తికెళ్లిన సంఘటన మరువక ముందే మళ్లీ గురువారం రాత్రి వీరభద్ర స్వామి దేవాలయంలో చోరీ జరిగింది. అయితే నిన్న మొన్నటివరకు తాళం వేసిన ఇళ్లను రాత్రి, పగలు తేడా లేకుండా దొంగతనాలు జరిగిన సంఘటనల్లో చోరీ సొత్తు ఇంకా రికవరీ రాకముందే దొంగలు పోలీసులకు సవాళ్లు విసురుతూ ఇప్పుడు ఏకంగా దేవాలయాలను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు నాంది పలుకుతున్నారు. ఇప్పటికే నాలుగవసారి దొంగలు దేవాలయాల్లో దొంగతనాలు చేసినట్లు దేవాలయ కమిటీ సభ్యులు చెబుతున్నారు. తాజాగా గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ సమీపంలో ఉన్న వీరభద్రస్వామి దేవాలయంలో దొంగతనం జరిగి దేవాలయంలో ఉన్న ఎనిమిది గ్రాముల అమ్మవారి బంగారు మంగళసూత్రం, హుండీలో ఉన్న దాదాపు రూ.రెండు వేల నగదు చోరీకి గురైనట్లు వీరశైవ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఘటనా స్థలాన్ని పట్టణ ఎస్సైతో పాటు క్లూస్‌టీం సభ్యులు పరిశీలించారు.

**పోలీసుల అదుపులో నిందితుడు ?**

వీరశైవ దేవాలయంలో జరిగిన చోరీకి సంబంధించిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే ఇందులో ఉన్న నిందితుడు ఈ దేవాలయంలో మాత్రమే దొంగతనం చేశాడా.. లేక తాయమ్మ గుడిలో కూడా హుండీ ఎత్తికెళ్లిన సంఘటనలో ఇతని పాత్ర ఉన్నదా అనే కోణంలో పట్టణ ఎస్సై శ్రీనివాస్ విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా దొంగతనాల నివారణకు పోలీసులు నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

## పరిశ్రమల స్థాపనకు సహకరించాలి



హైదరాబాద్‌లో తూర్పునిర్మలారెడ్డిని కలిసిన కల్వకుర్తి లయన్స్‌క్లబ్ చైర్మన్ రమేష్, కోశాధికారి శ్రీనివాసులు

కల్వకుర్తిటౌన్, జూలై 12 : పరిశ్రమల స్థాపనకు సహకరించాలని తెలంగాణ రాష్ట్ర టీజీఐఐసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన తూర్పు నిర్మల జగ్గారెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు కల్వకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కల్మిచెర్ల రమేష్, కోశాధికారి గోవిందు శ్రీనివాసులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు అందుకున్న తూర్పునిర్మల జగ్గారెడ్డిని శాలువాతో సన్మానించి మాట్లాడారు. పరిశ్రమలకు పెద్దపీటవేసి వ్యాపారులకు సహాయసహకారాలు అందించాలని, నూతనంగా వ్యాపార రంగంలోకి వచ్చేవారికి అన్నివిధాల ప్రోత్సహించాలని కోరినట్లువారు తెలిపారు.

# జోగుళాంబ ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మవారి ఆలయం ముందు శిష్యబృందంతో కలిసి ఉన్న శ్రీ మంజునాథ స్వామి

అలంపూరు, జూలై 12 : దక్షిణ కాశీ అలంపూరు పుణ్యక్షేత్రం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాల్లో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ఆలయంలో గణపతి పూజలు, అభిషేకాలు, రేణుక ఎల్లమ్మ ఆలయంలో సంతాన లక్ష్మీపూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు, వడిబియ్యం, చీరలు, త్రిశతి అర్చనలు, ఖడ్గమాలలు సమర్పించారు. ఆలయంలో అన్నదానం, వసతి ఏర్పాటు చేసినట్లు ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. కాగా, అన్నదాన సత్రం చాలా చిన్నగా, ఇరుకుగా ఉందని, వృద్ధులు, దివ్యాంగులు నిలుచొని భోజనం చేయాల్సి వస్తోందని, అంతేకాకుండా క్యూలైన్‌లో వెనుక ఉన్నవారికి భోజనం అందడం లేదని హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్‌శర్మ అనే భక్తుడు మీడియా ద్వారా అధికారులను కోరారు.

**ఆలయాన్ని దర్శించుకున్న ఇడుపునూరు శ్రీమఠం మంజునాథస్వామి**

కాగా, జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామిని రాయచూరు జిల్లా ఇడుపునూరు శ్రీమఠం గురువు మంజునాథ స్వామి శిష్య బృందంతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఇడుపునూరు గ్రామం నుంచి అమ్మవారి ఆలయానికి తన శిష్య బృందంతో రెండురోజుల పాదయాత్ర చేపట్టి శుక్రవారం ఉదయం మహామంగళ హారతి సందర్భంగా ఆలయాలను దర్శించుకున్నారు.

# పోలేపల్లి సెజ్‌ను సందర్శించిన శిక్షణ ఐఏఎస్‌లు



పోలేపల్లి సెజ్ వద్ద శిక్షణ ఐఏఎస్‌లకు స్వాగతం పలుకుతున్న అధికారులు

జడ్చర్ల, జూలై 12 : తెలంగాణ దర్శన్‌లో భాగంగా శుక్రవారం 2023 బ్యాచ్ శిక్షణ ఐఏఎస్ అధికారులు జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌ను సందర్శించారు. పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలను సందర్శించారు. సెజ్‌లో నెలకొల్పిన ఫార్మా పరిశ్రమల వివరాలు, ఫార్మ పరిశ్రమలలో తయారు అయ్యే మందుల వివరాలు తదితర వాటిని టీఎస్ఐఐసీ మేనేజర్ శ్రీనివాస్ వివరించారు. సెజ్‌లోని హెటెరో ఫార్మా పరిశ్రమను సందర్శించిన శిక్షణ ఐఏఎస్‌లకు పరిశ్రమ జనరల్ మేనేజర్ బాబురావు పరిశ్రమలో తయారు అయ్యే వాటి గురించి వివ రించారు. పోలేపల్లి సెజ్‌ను శిక్షణ ఐఏఎస్‌లు ఉమాహారితి (వికారాబాద్), అజ్మీర సంకేత్ కుమార్ (నిజామాబాద్), గరీమానారుల (నారాయణపేట), అభిగ్యాన్ మాల్వియా (ఆదిలా బాద్), అజయ్‌యాదవ్ (కరీంనగర్), మృణాల్‌శ్రేష్ట (ఖమ్మం), మనోజ్ (సంగారెడ్డి)లు సందర్శించగా, జిల్లా శిక్షణ మేనేజర్ హన్మంతు, జడ్చర్ల ఎంపీడీవో ప్రసాద్ ఉన్నారు.

# కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు వేయాలి

**- గంజాయిని పూర్తిగా నిర్మూలిద్దాం : ఎస్పీ జానకి**

**- మత్తుపదార్థాల నిషేధంపై కళాశాలల యాజమాన్యంతో సమావేశం**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జూలై 12 : విద్యార్థులు చెడుమార్గంలో నడవకుండా వారిని సక్రమమైన మార్గంలో నడిపించే బాధ్యత గురువులపైనే ఉంటుందని ఎస్పీ జానకి అన్నారు. విద్యార్థులు ఎక్కువ సమయం విద్యాసంస్థలలో గురువుల మధ్యనే ఉంటారని, అందుకే వారి ప్రవర్తన అంతా అర్థమవుతుందని, చెడు అలవాట్లకు గురవుతున్నట్లు తెలిస్తే అక్కడే వారిని సన్మార్గంలో పయనించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను నియమించాలని కోరారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని, జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. గంజాయి బారి నుంచి యువతను కాపాడదామని పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మత్తు పదార్థాల నియంత్రణపై కళాశాలల యాజమాన్యంతో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణ కోసం ముందస్తు చర్యల కోసమే ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యాంటీడ్రగ్స్ ప్రతీఒక్కరి బాధ్యత అని, డ్రగ్స్ తీసుకుంటే శిక్ష పడుతుందన్న విషయం ప్రతీ ఒక్కరికి తెలియాలని, ఇదివరకు ర్యాగింగ్‌పై విస్తృత ప్రచారం చేయడం వల్ల ర్యాగింగ్ తగ్గిపోయిందన్నారు. ఈ విషయంలో పోలీసులు చేసిన దాని కన్నా విద్యార్థుల్లో ర్యాగింగ్ చేస్తే శిక్ష పడుతుందన్న భయం, అవగాహన కారణంగా ఆటోమెటిక్‌గా రాగింగ్ బంద్ అయిందని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా వల్ల భవిష్యత్తులో యువత ప్రమాదంలో పడుతుందని, మత్తు పదార్థాల బారీన పడి ఎంతో మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. యువత జల్సాతో పాటు సులభంగా డబ్బు సంపాదించాలని అక్రమమార్గంలో గంజాయి రవాణాకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిపై ప్రత్యేక దృష్టిసారించాలని, ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇదివరకు గంజాయి కేసులో అరెస్ట్ అయిన వారు, గంజాయి సరఫరా చేస్తారన్న సమాచారం ఉన్న వ్యక్తుల కదలికపై నిఘా ఉంచాలని పోలీసుకు సూచించారు. వారి సమాచారం ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. అందరం సమన్వయంతో పనిచేసి భవిష్యత్తులో మహబూబ్‌నగర్‌ను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషిచేద్దామన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాల సమాచారాన్ని ఇవ్వాలనుకునేవారు పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712659360కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి**

**- రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం**



గౌరవ వందనం స్వీకరిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూలై 12 : సబ్బండ వర్గాల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల ఇంటర్ డిస్ట్రిక్ట్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు మార్చ్ ఫాస్ట్‌లో క్రీడాకారుల గౌరవ వందనం ఎమ్మెల్యే స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని, క్రమశిక్షణతో సాధన చేస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. సీఎం ఈ ప్రాంతానికి విద్య, క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఫుట్‌బాల్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యం చేకూరుతుందని అన్నారు. కల్వకుర్తి మునిసిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీపీ.ఫాల్గుణ, మాజీ సర్పంచ్‌లు పసుల సుదర్శన్‌రెడ్డి, ఎన్నం భూపతిరెడ్డి, దామోదర్‌గౌడ్, పలువురు నాయకులు, కౌన్సిలర్లు ఉన్నారు.

# హామీలను అమలు చేయాలి

**- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమణ**




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమణ

గద్వాల టౌన్, జూలై 12 : ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంవీ.రమణ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో కేవలం ఉచిత బస్సు తప్పా ఇప్పటివరకు మిగతా వాటి గురించి పట్టించుకోకపోవడం అవకాశవాదమన్నారు. శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశా నికి రమణ హాజరై, మాట్లాడారు. రైతు రుణమాఫీ, రైతుబంధు విషయంలో ప్రభుత్వం సమావేశాలు, సమాలోచనల పేరుతో కాలయాపన చేయడం అవివేకమన్నారు. కేంద్రంలోనూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ మతోన్మాద చర్యలను ప్రోత్సహిస్తే తమ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందన్నారు. రాష్ట్రంలో గెలుపొందిన బీజేపీ ఎంపీలు రాష్ట్ర విభజన హామీల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడుతూ గద్వాలలో మెడికల్ కళాశాల తరగతులను వెంటనే ప్రారంభించాలని, అలంపూర్ చౌరస్తాలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. భారత్‌మాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందజేయాలన్నారు. జిల్లాలో యథేచ్ఛగా పెరిగిపోతున్న ప్రైవేటు విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలన్నారు. కళాశాల వసతి గృహాల తరలింపు జీవోను ఉపసంహరించుకోవాలని, అలంపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించాలని కోరారు. కాగా, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మండలాల కమిటీల బాధ్యులు ప్రజా పోరాటాలు నిర్వహించాలని సూచించారు. జీకే ఈదన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో రేపల్లె దేవదాసు, జి.రాజు, పరంజ్యోతి, వీవీ.నరసింహ, మద్దిలేటి, నర్మద, ఉప్పేరు నరసింహ, రమేష్ పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**- కేసు నమోదు**

గట్టు, జూలై 12 : కర్ణాటకకు అక్రమంగా తరలుతున్న 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కేటీ.మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణుడు, కృష్ణలు శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో బలిగేర చెక్‌పోస్టు వద్ద నిఘా ఉంచి అయిజ రోడ్డు నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. వరుసగా మూడు బొలెరో వాహనాలు రాగా వాటిని తనిఖీ చేశారు. ఆయా వాహనాల్లో నిండుగా సంచులు ఉండడంతో అనుమానం వచ్చి వాటిని తీసి చూశారు. మొత్తం సంచుల్లో 60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉండడంతో వాహనాలతో పాటు, ఐదుగురిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల, జూలై 12 : రేషన్ బియ్యం పట్టివేతపై కేసు నమోదు చేసిన సంఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో చోటుచేసుకొంది. ఏఎస్ఐ సుజ్ఞానం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాపిశెట్టి కిషన్ రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆటోలో 2 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నాడు. సమాచారం మేరకు స్థానిక పోలీసులు సివిల్ సప్లయ్ డీటీ రవికుమార్ ఉప్పునుంతల కోటబురుజు వద్ద పట్టుకొని స్టేషన్‌కు ఆటోను తరలించారు. డీటీ రవికుమార్ ఫిర్యాదు మేరకు కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

అలంపూర్ చౌరస్తా, జూలై 12 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీకి గురైందని ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఏపీలోని పంచలింగాల గ్రామానికి చెందిన ఎం.సోలేమాన్ అనే రైతుకు పుల్లూరు గ్రామ శివారులో కొంత వ్యవసాయ భూమి ఉంది. అందులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఖరీఫ్ సాగుకోసం గురువారం పొలానికి వెళ్లిన సోలెమాన్ విద్యుత్ సరఫరా లేకపోవడాన్ని గమనించాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించగా అందులో ఆయిల్ చోరీకి గురైనట్లు తెలుసుకుని ఉండవల్లి పోలీసులకు తెలిపాడు. సుమారు రూ.30 వేలు విలువ గల 150లీటర్ల ఆయిల్ చోరీకి గురైందని పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ యువతి మృతి

రాజోలి, జులై 12 : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువతి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన తిరుపాల్, ఆశీర్వాదమ్మ దంపతుల కూతురు రూబిక(22) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. వైద్యుల సలహా మేరకు కొన్ని నెలలుగా చికిత్స తీసుకుంటోంది. వారంరోజులుగా జ్వరం, కిడ్నీ వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇటీవల పెళ్లి కూడా నిశ్చయించారు. కొన్నిరోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువతి పాడె ఎక్కుతుందని కుటుంబ సభ్యులు విలపించడం గ్రామస్థులను కలిచివేసింది. యువతి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## అదనపు కట్నం కోసం వేధించిన అత్తింటి వారిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 12 : అదనపు కట్నం కోసం భర్త రాముడు, అత్త వెంకటమ్మ, మరిది వేధిస్తున్నాడని జంగం సుజాత అనే వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్ గ్రామానికి చెందిన సుజాతకు గత 14ఏళ్ల క్రితం కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లి గ్రామానికి చెందిన రాముడుతో వివాహమైంది. వారికి ముగ్గురు కూతుళ్లు పుట్టారు. ముగ్గురు కూతుళ్లలో ఒక కూతురు చనిపోయింది. తాను రెండో పెళ్లి చేసుకుంటానని భర్త రాముడు, అత్త వెంకటమ్మతో పాటు మరిది తరచూ వేధించేవారని ఫిర్యాదులో పేర్కొంది. వారు పెట్టిన ఇబ్బందులకు తట్టుకోలేక గత ఆరు నెలల క్రితం పుట్టింటికి వచ్చింది. ఇటీవల మళ్లీ అత్తారింటికి వెళ్లడంతో ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని తనను వెళ్లగొట్టారని ఫిర్యాదులో పేర్కొంది. లేకుంటే అదనంగా రెండు లక్షల కట్నం కావాలని డిమాండ్ చేశారని లేకుంటే రెండో పెళ్లికి ఒప్పుకోవాలని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

## నేడు మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం సమావేశం

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 12 : మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఫోరం కన్వీనర్ ఆవిటి నాగశ్రీ, కో-కన్వీనర్ శశికళలు ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ బాధ్యతలు, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న భద్రతా సమస్యలు, సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చ ఉంటుందని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## 13న బౌద్ధ కుటుంబాల సమ్మేళనం

పాలమూరు, జూలై 12 : జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో 13వ తేదీన బౌద్ధకుటుంబాల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ది బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు మల్లెపోగు ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా బౌద్ధ భిక్షువులు వెనెరబుల్ ఉపేఖ్ఖ అయ్యాజి, వెన్నబుల్ సద్ధరక్ఖిత బంతెలు హాజరవుతారని వివరించారు. బుద్ధపూజ, త్రిచరణ, పంచశీల వితరణ, బౌద్ధదమ్మ సందేశం ఇస్తారని తెలిపారు. బౌద్ధ అభిమానులు, ఉపాసక, ఉపాసికలు అధికసంఖ్యలో పాల్గొనాలని సభ్యులు డాక్టర్ సత్తయ్య, రాజేశ్వర్‌రావు, జి.పరంధాములు పిలుపునిచ్చారు.

# ఇష్టారాజ్యంగా సీడ్స్, ఫర్టిలైజర్స్ దందా

**- మొక్కుబడిగా అధికారుల తనిఖీలు**



మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో నిల్వ ఉంచిన ఎరువుల బస్తాలు

మిడ్జిల్, జూలై 12 : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను నిలువునా దోచేస్తున్నారు. ఇటీవల మిడ్జిల్, రాణిపేట గ్రామాలతో పాటు పలు గ్రామాలలో కొత్త కొత్త దుకాణాలు వెలిసాయి. కొన్ని సీడ్స్ దుకాణాలలో నకిలీ విత్తనాలు, లూజుగా అమ్ముతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. పలు విత్తన, ఎరువుల దుకాణాలలో నిషేధిత విత్తనాలను విక్రయిస్తున్నప్పటికీ వారిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. కేవలం ఫొటోలకు మాత్రమే అన్నట్లు అధికారులు తనిఖీలు చేపడుతున్నారని, జిల్లా స్థాయి అధికారులు మండలానికి వస్తే కనీసం పాత్రికేయులకు కూడా సమాచారం ఇవ్వకుండా వారు వెళ్లాక అధికారులు వచ్చి వెళ్లారు అని చెప్పి మండల వ్యవసాయాధికారులు మాట దాటేస్తున్నారు. వచ్చిన అధికారులు మండల స్థాయి అధికారులు చెప్పిందే విని మొక్కుబడిగా తనిఖీలు చేసి వెళ్తుంటారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయాధికారి అండదండలు పుష్కలంగా ఉండటంతో విజిలెన్స్, ఇతర జిల్లాశాఖ అధికారులు తనిఖీలకు వచ్చిన వారికి ముందుగానే సమాచారం తెలిసి బయటపడుతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. కొన్ని మందుల, ఎరువుల దుకాణాలలో తీసుకున్న వాటికి రశీదులు కూడా ఇవ్వడం లేదని వ్యవసాయాధికారులకు తెలియజేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు అంటున్నారు. ఎరువుల దుకాణాలలో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు చేపడుతున్నారని ఏవోకు ఫోన్‌ద్వారా సమాచారం అందిస్తే దుకాణాదారులకే వత్తాసు పలికినట్లు పలువురు రైతులు తెలిపారు.

● ధరల నిర్ణయ పట్టిక బోర్డులపై ధరలే ఉండవు : మండలంలోని సీడ్స్ పెస్టిసైడ్స్ దుకాణాలలో విత్తనాలు, ఎరువులకు సంబంధించిన ధరలను సూచిక బోర్డుపై ఏర్పాటు చేయాలని ఉన్నప్పటికీ అలా ఏ దుకాణాలలో ధరల పట్టికను ఏర్పాటు చేయరు. మండలంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాల గురించి జిల్లా వ్యవసాయాధికారులు తక్షణమే స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

# మొహర్రం వేడుకలు కలిసిమెలిసి జరుపుకోవాలి



చిన్నపొర్లలో గల పీర్ల చావడి వద్ద మాట్లాడుతున్న ఎస్సై ఎం.డీ నవీద్

ఊట్కూర్, జూలై 12 : ఊట్కూర్ మండలంలో చిన్నపొర్ల గ్రామంలో మొహర్రం వేడుకలు ప్రజలందరు కలిసిమెలిసి సామరస్యంగా జరుపుకోవాలని ఊట్కూర్ ఇన్‌చార్జి ఎస్సై ఎం.డీ నవీద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం చిన్నపొర్ల గ్రామంలో పీర్ల ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్గనైజర్లతో మాట్లాడారు. పీర్ల ఊరేగింపులో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆర్గనైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పీర్ల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**మక్తల్ మండలంలో..**

మక్తల్‌రూరల్: మక్తల్ మండలం జక్లేర్, గుడిగండ్ల, లింగంపల్లి, మంథన్‌గోడ్, చిట్యాల, గోలపల్లి, అనుగొండ తదితర గ్రామాల్లో శుక్రవారం మొహర్రంవేడుకలు కొనసాగాయి. ఈ సందర్భంగా మసీదుల వద్ద పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో ఐదు రోజుల పాటు మొహర్రం వేడుకలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ




నిర్వాహకుల నుంచి బంగారు పతకం అందుకుంటున్న విద్యార్థిని పార్వతీ

మక్తల్, జూలై 12 : ఈనెల 7న పుల్లెల గోపీచంద్ అకాడమీ హైదరాబాద్‌లో జరిగిన రెండ తెలంగాణ రాష్ట్రస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మక్తల్‌కు చెందిన క్రీడాకారిణి పార్వతీ(మక్తల్ బాలికల ఉన్నత పాఠశాల) వందమీటర్ల విభాగంలో బంగారు పతకం, మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలకు చెందిన మాధవీ, కౌషికలు లాంగ్‌జంప్‌లో బ్రౌంజ్‌మెడల్ సాధించారని సెంటర్ కోచ్‌లు జగదీష్, రాజులు తెలిపారు. ఈ పతకాలు ఇండియన్ జూనియర్ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేష్, సారంగపాణి ఆధ్వర్యంలో మెడల్స్, సర్టిఫికెట్స్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట అథ్లెటిక్స్ సెక్రెటరీ రమణ, క్రీడాకారిణులు దీప్తి, శివంజి, రమణమ్మ పాల్గొన్నారు.

# గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలి



పేట డిపో ముందు ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థులు

నారాయణపేట, జూలై 12: నారాయణపేట బస్సు డిపో ముందు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం పేట ఆర్టీసీ డిపోముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ మండల పరిధిలోని కోటకొండ, అభంగాపూర్, బండగొండ, తిర్మలాపూర్, గనిమోని బండ గ్రామాలకు నిలిపివేసిన ఆర్టీసీ బస్సులను తిరిగి నడిపించాలని పీడీఎస్‌యూ విద్యార్థులు డిమాండ్ చేశారు. గ్రామాలకు బస్సులు నిలిపి వేయడంతో గ్రామస్థులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. నిలిపివేసిన బస్సులను తిరిగి నడిపించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహకార్యదర్శి వెంకటేశ్, నాయకులు మహేష్, మొయిపాల్, లక్ష్మణ్, ప్రవీణ్, నవీన్, అనిల్, రాజు, అనురాధ, అనిత, అనూష, వివిధ గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

నారాయణపేటరూరల్, జూలై12: మండల పరిధిలోని బొమ్మన్‌పాడ్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం బాలాజీ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రెడ్డెప్ప, శివకుమార్, ప్రసాద్‌రావు, విద్యావలంటీర్‌గా పనిచేసిన చందనకు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సైతం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి ఎంతో సహకరించారన్నారు. వారి సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు భగవంతు, శ్రీనివాస్, రవి, ఉపాధ్యాయులు విశ్వనాథ్, లింబ్యాయనాయక్, రాములు, శ్రీకాంత్, రవికుమార్, పాండునాయక్, వాల్యానాయక్, అనిత తదితరులు పాల్గొన్నారు.

# రేకులకుంట సర్వే

**- హద్దులు దొరకడం లేదంటూ అర్ధాంతరంగా నిలిపివేత**

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసి, జూలై 12 : మండలంలోని బొలవోనిపల్లి గ్రామంలో రేకుల కుంటను శుక్రవారం అధికారులు సర్వే చేశారు. కొంతకాలంగా ప్రైవేట్ వ్యక్తులు కుంటను దున్నుకుంటున్నారని 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దాంతో అధికారులు స్పందించారు. మండల సర్వేయర్ అరుణ, ఓ ప్రైవేట్ సర్వేయర్‌తో కలిసి సర్వేకు వెళ్లింది. హద్దులు సరిగా దొరకడం లేదని టీపన్‌పేపర్ మరోటి తీసుకురావాలని అర్థాంతరంగా సర్వేను నిలిపివేశారు. మళ్లీ సోమవారం పూర్తిస్థాయిలో సర్వే చేస్తామన్నారు. కాగా, గత మూడురోజుల క్రితం ప్రైవేట్‌వ్యక్తులు కట్టను తవ్వి మట్టి తరలిస్తుండటంతో కుంట పూర్తిగా ధ్వంసమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు పూర్తిగా సర్వే చేయాలని గొలుసుకట్టు చెరువులు గుర్తించి సాగునీరు అందించాలని రైతులు కోరారు.

# వైద్య సిబ్బంది తీరు మార్చుకోవాలి

**- జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ**

కోస్గి, జూలై 12: రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ అన్నారు. సిబ్బంది వ్యవహార శైలిపై శుక్రవారం ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రాత్రిలో తన కుమారుడికి అనారోగ్యం కారణంగా కోస్గి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దవాఖానాకు తీసుకెళ్తే పట్టించుకోలేదన్నారు. తన కుమారుడికి ఆక్సిజన్ సెక్యూరిటీ గార్డుతో పెట్టించుకోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఆసుపత్రి సిబ్బంది వ్యవహరిస్తే పేదలకు ప్రభుత్వంపై నమ్మకంపోతుందన్నారు. వైద్యసిబ్బందిపై జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. మరో సారి ఇలాంటి ఘటనలు పునారావృతం అయితే హాస్పిటల్ ముందు ఆం దోళన చేపడతామని హెచ్చరించారు.

# మండల వ్యాప్తంగా దంచి కొట్టిన వాన

ఊట్కూర్, జులై 12 : మండల వ్యాప్తంగా శుక్రవారం జోరుగా వర్షం కురిసింది. సాయంత్రం గంట పాటు వర్షం దంచి కొట్టింది. ఆయా గ్రామాల్లో చెరువుల్లో ఒక స్థాయిలో నీరు వచ్చి చేరాయి. ఈ వర్షానికి పంటలకు జీవం వచ్చినట్లు అయింది. గ్రామాల్లో కాల్వలు పొంగిర్లాయి. పాఠశాల ఆవరణ, రోడ్లు అన్నీ చిత్తడిగా మారాయి.

# అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట, జూలై 12: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండా లని ట్రాఫిక్ కానిస్టేబుల్ దేవేందర్ అన్నారు. పేట పాత ఆర్టీసీ బస్టాండ్ స మీపంలో విద్యార్థులకు సైబర్‌నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచా రం ఇవ్వాలని సూచించారు. అలాగే రోడ్డుభద్రత నియమాలు పాటించాలన్నారు.

# ఫ్రై డేను డ్రై డేగా పాటించాలి

కోస్గి, జూలై 12: ప్రతీ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని కోస్గి మునిసిపల్ క మిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం ఆయన కోస్గి మునిసిపాలిటీ పరిధి లోని పదవ వార్డులో కమిషనర్ పర్యటించారు. కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోస్గి కౌన్సిలర్లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# గుంతలమయం

**- అధ్వానంగా మరికల్ ఆర్టీసీ బస్టాండ్**
**- కనీస సౌకర్యాలు లేక ప్రయాణికుల ఇబ్బందులు**
**- ఆధునికీకరణపై నీలినీడలు**



గుంతలు పడిన మరికల్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ

మరికల్, మే 12: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నాయి. ఇక వర్షాకాలం వస్తే చాలు.. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా బురదమయంగా మారుతుంది. అసలు బస్టాండ్ లేదా చేరువ అన్నట్లు తలపిస్తుంది. బస్టాండ్‌కు వెళ్లాలంటే ప్రయాణికులు జంకే పరిస్థితులు ఏర్పడ్డాయి. అదేవిధంగా బస్టాండ్ వెనుక చెత్తాచెదారంతో కూడిన బురద దీంతో దోమలు ఈగలతో దుర్వాసన రావడంతో ప్రయాణికులు జంకుతున్నారు.




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినప్పుడు ఏర్పాటు చేసిన శిలాఫలకం

నారాయణపేట జిల్లా మరికల్‌లో 1983లో బస్టాండ్ నిర్మించారు. రానురాను బస్టాండ్ గురించి సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో ప్రయాణికుల అవస్థలు వర్ణాతీతంగా మారాయి. మరికల్ మీదగా ప్రతీరోజు వందల బస్సులు నారాయణపేట, పాలమూరు, ఆత్మకూర్, రాయిచూర్, గుంటూరు, గోవా, గుల్బర్గా, యాదగిరి, బెల్గం, హుబ్లీ, శివమొగ్గ తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు కొనసాగుతుంటాయి. కానీ బస్టాండ్ తలరాత మారకపోవడంతో ప్రయాణికు లు నానా అవస్థలు పడుతున్నారు.

**తిష్ఠ వేసిన సమస్యలు**

బస్టాండ్ ఆవరణలో నిలువ, నీడ లేక కనీసం కూర్చోవడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో నీరు పోవడానికి దారి లేక ఆవరణలోనే నిలిచి పోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో బస్సు డ్రైవర్లు బస్టాండ్‌కు రావలంటే భయపడుతుంటారు దాంతో ప్రయాణి కులు బస్టాండ్‌లో నుంచి వర్షంలో తడుస్తూ వచ్చే సారికి బస్సు వెళ్లిపోతుందని వాపోతున్నారు. వేసవి కాలంలో తాగునీరు అందుబాటులో ఉండటంలేదు. మహిళలకు మరుగుదొడ్లు బయట ఉండడంతో బస్సుల్లో ప్రయాణించే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**అసెంబ్లీ ఎన్నిక కోడ్ నేపథ్యంలో..**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరికల్ ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మార్చేందుకు రూ.1.20 కోట్లను మంజూరు చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అప్పట్లో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో బస్టాండ్ ఆధునికీకరణ మరమ్మతులు చేపడుతారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం బస్టాండ్ ఆధునికీకరణ కోసం సీడీపీ నిధులు మంజూరు చేస్తే బస్టాండ్ ప్రాంగణంలోకి వర్షాపు నీరు రాకుండా పక్కాగా డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించొచ్చు. ప్రయాణికుల సౌకర్యార్థం కోసం నాణ్యమైన ఫర్నీచర్, నీటివసతి, క్యాంటీన్‌పై ఉన్న రేకులను తొలగించి సీసీ వేయాలని, బస్టాండ్ ముందు భాగంలో దుకాణాలు నిర్మించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**నిధులు మంజూరు చేయాలి**



బస్టాండ్ అధునికీకరణ కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఎన్నికల కోడ్ కారణంగా తిరిగి వెళ్లాయి. కొత్త ప్రభుత్వం గత నిధులను మళ్లీ మంజూరు చేసి టెండర్ వేయాలి. బస్టాండ్‌లో కనీస సౌకర్యాలతో పాటు సీసీరోడ్లు తదితర సమస్యలు పరిష్కరించాలి.

- బోదిగేల శ్రీనివాసులు, బీఎస్పీ నాయకుడు

**తాగునీటి వసతి కల్పించాలి**



గత 30 ఏళ్ల నుంచి బస్టాండ్ మరమ్మతులకు నోచుకోలేదు. వేసవి కాలంలో తాగునీటి వసతి లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే బస్టాండ్‌లో క్యాంటిన్, కూర్చువడానికి సీట్లు ఏర్పాటు చేయాలి. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

- పోలేమెని రమేష్, బీజేపీ నాయకుడు

# వన మహోత్సవంలో ప్రజలందరు పాల్గొనాలి



జాజాపూర్ పాఠశాలలో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

ఊట్కూర్, జూలై 12 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలందరు పాల్గొని మొక్కలను నాటాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన మాట్లాడుతూ మొక్కలను పెంచుతూ వచ్చేతరానికి కాలుష్యరహిత వాతావరణాన్ని బహుమతిగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ రాము, కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

**జాజాపూర్ పాఠశాలలో...**

నారాయణపేటరూరల్: మండల పరిధిలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీపీవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఒక చెట్టును దత్తత తీసుకుని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. చెట్ల నుంచి అనేక రకాలైన లాభాలు, పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కల నుంచి లభిస్తాయన్నారు. హెచ్‌ఎం భారతి మాట్లాడుతూ పాఠశాలలో 150 మొక్కలు నాటామని వాటిలో దానిమ్మ, జామ, బొప్పాయి, పూలచెట్లు ఉన్నాయన్నారు. ప్రతీ విద్యార్థి చెట్టును సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పేట ఎంపీడీవో బాలాజీ, ప్రత్యేకాధికారి శ్రీరంగారావు, ఏపీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సుమలత, ఉపాధ్యాయులు విజయ, మధుసూదన్ రావు, భాను ప్రకాశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**కొత్తపల్లి గ్రామంలో..**

మాగనూరు: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలని గ్రామ ప్రత్యేక అధికారి సురేష్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మాగనూరు మండలం కొత్తపల్లి గ్రామంలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు నాటి పరిరక్షించడం వల్ల కాలుష్య నివారణ జరిగి, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. రైతులు పొలం గట్లపై పండ్ల మొక్కలు నాటాలన్నారు. విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు తిమ్మప్ప, అంజమ్మ, కార్యదర్శి నరసింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణకు సహకరించాలి



బాధితులతో మాట్లాడుతున్న కమిషనర్

కోస్గి, జూలై12: కోస్గి పట్టణంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు విస్తరణకు పట్టణ ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ శశిధర్ కోరారు. రోడ్డువిస్తరణలో ఇళ్లు కోల్పోనున్న భవన యజమానులు, కౌన్సిలర్లతో శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఊడరమ్మ గుడి వరకు అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు విస్తరణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. కోర్టు కేసులతో రోడ్డు పనులు నిలిచిపోయాయని భవన నిర్మాణదారులకు ప్రభుత్వ మార్కెట్‌విలువ ప్రకారం నష్టపరిహారం అందించేందుకు కృషిచేస్తామన్నారు. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అందరికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అందుకు బాధిత యజమానులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాణు నాయక్, ఇద్రిస్, నాయకులు బెజ్జు రాములు, శ్రీనివాస్, తదితరులున్నారు.

# లయన్స్‌క్లబ్ సేవలు విస్తరించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మక్తల్, జూలై 12 : పేద ప్రజల సంక్షేమంకోసం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తరించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్‌లో లయన్స్‌క్లబ్ 22వ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సేవాకార్యక్రమాలు చేపట్టిన మక్తల్ క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సన్మానించారు. 2024-25 ఏడాదికిగాను లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా డీవీచారి, కార్యదర్శిగా శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా అంజన్‌ప్రసాద్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు మొక్కలు నాటారు. రెడ్‌క్రాస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ నటరాజ్ ఆ ధ్వర్యంలో 50మంది మునిసిపల్ కార్మికులకు దుప్పట్లు పంపి ణీ చేశారు. డాక్టర్ల దినోత్సవం సందర్భంగా వైద్యులు పార్వతీ, ప్రాణేష్, సునీత, బాలనర్సయ్య, అనిల్‌కుమార్, మాధవీలను సన్మానించారు. అంతకు ముందు లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్‌జోష్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సమావేశంలో ప్రోగ్రామ్ చైర్మన్ గవినోళ్ల గోపాల్ రెడ్డి, కొండయ్య, సుగూరు జైపాల్‌రెడ్డి, రాజుల ఆశిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, అంబదాస్ రావు, మామిళ్ల పృథ్వి, ఆడెం శ్రీనివాసులు, కట్ట వెంకటేష్, రవికుమార్‌గౌడ్, విక్రమ్, జయశ్రీ పాల్గొన్నారు.

**భావిపౌరులను తీర్చిదిద్దాలి**

నర్వ: విద్యార్థులకు విద్య, బుద్ధులు నేర్పి భావిపౌరులు తీర్చిదిద్దాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని యాంకి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ దుస్తులు, పుస్తకాలు అందాయా అని ప్రశ్నించారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అ నంతరం అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బజారు గోపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్ర ధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కాంగ్రెస్‌పార్టీ మండ ల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, వివేక్ వర్ధన్ రెడ్డి, శరణప్ప, గ్రామ నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి, రాము, జనార్దన్ రెడ్డి, తదితరులున్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట, జూలై 12: పదవీవిరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ. రెండులక్షలు, హెల్పర్లకు రూ. లక్ష ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్, యూనియన్ జిల్లా గౌరవకార్యదర్శి బలరాం, కార్యదర్శి మంజుల డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కు వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి ఏడవరోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్షలు చేపట్టిన ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. రిటైర్మెంట్ తరువాత వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు తదితరుఉపాల్గొన్నారు.

# విద్యా వలంటీర్లను నియమించాలి

మాగనూరు, జూలై 12: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల లేనిచోట విద్యావలంటీర్లను నియమించాలని పీఆర్‌టీయూ టీఎస్ మండల ప్రధాన కార్యదర్శి తిమ్మన్న శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కారణంగా ఖాళీ అయిన స్థానాల్లో విద్యావలంటీర్లను నియమించాలన్నారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్ల కొరత ఏర్పడిందన్నారు. డీఎస్‌సీ ఉపాధ్యాయులు వచ్చే వరకు తాత్కాలిక చర్యలు తీసుకోవాలని కోరారు.

# నల్లబ్యాడ్జీలతో నిరసన

ఊట్కూర్, జూలై 12 : బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తపస్ మండల నాయకులు కోరారు. శుక్రవారం తపస్ ఆధ్వర్యంలో పెద్దజట్రం కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు ధనుంజయ్, శివకుమార్, సంతోష్‌కుమార్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, శిరీష, గీత, నర్సింహులు, అనిత, మంజుల, అంబికా, లక్ష్మీ, వెంకటయ్య, వసుందర, స్రవంతి, కావ్య, అరుణ, హేమలత, అనురాధ, నర్సమ్మ, నరేష్, శేఖర్, కల్యాణి పాల్గొన్నారు.

# ముదిరాజ్‌లను 'బీసీ ఏ'లోకు మార్చాలి

నారాయణపేట టౌన్, జూలై 12 : ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లకు మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్ అన్నారు. ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాల సమర్పణ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం సిటిజన్స్ క్లబ్ ఆవరణలో ఆవిష్కరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ముదిరాజులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కాంత్‌కుమార్, అప్పిరెడ్డి పల్లి రాము, గురుమేస్త్రీ, మొగులప్ప, భీమ శంకర్, నీలి అర్వింద్, రాజు, జనార్దన్, వెంకటేష్ పాల్గొన్నారు.

# బదిలీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

మక్తల్‌రూరల్, జూలై 12 : బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం కర్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్యగౌడ్‌కు, మండల నోడల్ ఆఫీసర్ అనిల్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలకోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన ఉపాధ్యాయులకు తీరా బదిలీలు జరిగినా రిలీవ్ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. వెంటనే ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ నాయకులు రవీందర్, పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు రాంగోపాల్, ఎస్‌టీయూ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మహంకాళి అమ్మవారికి పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

నారాయణపేట, జూలై 12: ఆషాఢ శుద్ధ షష్టి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో మహంకాళి దేవాలయంలో మహిళలు పూజలు చేశారు. ఈ సందర్భంగా పసుపు కుంకుమ, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విదేశీ విద్య ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట టౌన్, జూలై 12: సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద విదేశీ విద్యాలయాల్లో పీజీ, డాక్టరేట్, పీహెచ్‌డీ ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్య ఉపకార వేతనానికి క్రైస్తవ మైనారిటీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎంఏ రషీద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ ఆదాయం రూ.ఐదులక్షల లోపు ఉండాలని, 2024 జనవరి 1నుంచి 2024 జూలై 31లోగా విదేశీ విద్యాలయాల్లో ప్రవేశం పొందిన ఉన్న వారు అర్హులన్నారు. వచ్చేనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని హార్డ్‌కాపీలను అటెస్టెడ్ చేసి రెండు సెట్లు స్థానిక మైనా రిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని సూచిం చారు.

# 'నిందితులపై చర్యలు తీసుకోవాలి'

నారాయణపేట టౌన్, జూలై 12: నంద్యాల జిల్లా పగిద్యాల మండలంలో ఎనిమిది ఏళ్ల బాలిక మృతికి కారకులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు బోయ లక్ష్మణ్, రమేష్, బోయ శరణప్ప, వెంకట్రాములు, సైకిల్ రాములు, చంద్రశేఖర్, విజయ్, ఆనంద్, అంజి, రవి, కిశోర్, అప్పి పాల్గొన్నారు.

# అర్హులకు 'రైతు భరోసా' అందించాలి

నారాయణపేట టౌన్, జూలై 12: వ్యవసాయేతర, కార్పొరేట్ రైతులకు రైతు భరోసా నుంచి మినహాయింపు ఇచ్చి అర్హులైన రైతులకు రైతు భరోసా ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కిసాన్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందించారు. రైతు భరోసా ఇవ్వకపోవడంతో అసలైన రైతులు ఆర్థికంగా పంట పండించేందుకు ఇబ్బందిపడుతున్నారన్నారు. పంటలు పండించేందుకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. భారతీయ కిసాన్ సంఘం నాయకులు లక్ష్మీకాంత్, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించొద్దు

**- కమిషనర్‌కు వినతిపత్రం అందజేత**

కోస్గి, జూలై 12: భూత్పూర్ చించోలి హైవే విస్తరణలో భాగంగా కోస్గి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించొద్దని దళిత సంఘ నాయకులు కోరారు. శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు, మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బ్యాగరి రాములు మాట్లాడుతూ హైవే పనులకు అంబేడ్కర్ విగ్రహం అడ్డంకి అయితే తీసి మళ్లీ అదేస్థానంలో ఉంచాలన్నారు. స్పష్టమైన హామీ ఇస్తేనే విగ్రహాన్ని తీయనిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాగరి రాములు, లక్ష్మణ్ తదితరులున్నారు.

# బాలలకు అందుబాటులో ఉంటాం

దామరగిద్ద, జూలై 12: బాలలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన అందుబాటులో ఉంటామని చైల్డ్ హెల్ప్‌లైన్ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం దామరగిద్ద కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాలరక్షా భవన్‌లో 24 గంటల పాటు సేవలు అందించేందుకు అందుబాటులో ఉంటారన్నారు. హెల్ప్‌లైన్ నంబరు 1098ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, విద్యారాణి, లక్ష్మణ్‌నాయక్, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

# అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

మాగనూరు, జూలై 12: మాగనూరు మండలం వడ్వాట్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో నూతన అదనపు గదుల నిర్మాణం కోసం శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం గురురాజారావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ రూ.54లక్షలతో అదనపు గదుల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ రవీందర్, ఈడ్గి నరసింహగౌడ్, రాములు పాల్గొన్నారు.